క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామపారాయణం



పారాయణంలో పాల్గొన్న దాతలు

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట ఆశ్రమంలో లోక కళ్యాణార్థం చేపట్టిన విష్ణు సహస్రనామ స్తోత్ర సామూహిక పారాయణం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు గుండా గోపాలు, భజన కృష్ణయ్య, రామ కృష్ణ,హుసేన్ రెడ్డిలకు పలువురు దాతలు అన్నదానం నిమిత్తం రూ.51 వేల విరాళం అందజేశారు.

ఉచిత శిక్షణ

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లో డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సుకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీకే ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి సోమవారం తెలిపారు. ఇంటర్, డిగ్రీ అర్హత కలిగి, వయస్సు 18–30 ఏళ్లలోపు ఉన్నవారు 97059 98056, 84659 25341 నంబర్లకు సంప్రదించాలని ధనలక్ష్మి తెలిపారు. శిక్షణ పూర్తయిన వారికి ఉపాధి అకాశం కల్పించనున్నట్లు ఆమె తెలిపారు.

ప్రభుత్వ విద్యకు ప్రోత్సాహం

డోన్ టౌన్: విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేరెంట్స్ కమిటీల చైర్మన్లు, హెచ్‌ఎంలు అన్నారు. సోమవారం పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలతో పాటు మండలంలోని పలు గ్రామాల పాఠశాలల హెచ్‌ఎంలు, పేరెంట్స్ కమిటీల చైర్మన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాతపేట హెచ్‌ఎం పద్మావతి, సీనియర్ ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి, వెంకటాపురం పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ హనుమంతు, హెచ్‌ఎం మునీంద్ర మాట్లాడుతూ నాడు నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేసి, విద్యార్థులకు జగనన్న విద్యా కిట్లు, వసతి దీవెన, విద్యా దీవెన అందిస్తూ ప్రభుత్వం చేయూతనిస్తోందని, పిల్లలు సక్రమంగా బడికి పంపే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని కోరారు. రామదుర్గం స్కూల్లో నిర్వహించిన సమావేశానికి సర్పంచ్ నాగన్న హాజరయ్యారు.

రేపు ఆర్థిక మంత్రి బుగ్గన రాక

బేతంచెర్ల: ఈనెల 28న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బేతంచెర్ల మండలానికి రానున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ముందుగా కర్నూలు రహదారిలోని ఆటోనగర్ భూమిపూజ అనంతరం కనుమ కింది కొట్టాల గ్రామంలో ఎర్రజాల గుహల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తారన్నారు. మధ్యాహ్నం నగర పంచాయతీ కార్యాలయంలో ఆయా గ్రామల ప్రజలతో సమస్యలు, అభివృద్ధిపై చర్చిస్తారన్నారు. ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావచ్చన్నారు.

30న డోన్‌లో మంత్రి పర్యటన

డోన్: ఈనెల 30న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ మండలంలో పర్యటిస్తారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, కొత్తపల్లె సర్పంచ్ విద్య సోమవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. యు కొత్తపల్లె గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.17.5 లక్షలతో నిర్మించిన ఆరోగ్య కేంద్ర భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారని పేర్కొన్నా రు. అలాగే జూలై 1న రూ.28 లక్షలతో రైల్వేస్టేషన్ రోడ్డులో నిర్మించిన మునిసిపల్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారని మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

గోవులను తరలిస్తే కఠిన చర్యలు

డోన్ టౌన్: బక్రీద్ సందర్భంగా ఎవరైనా గోవులను వాహనాల్లో తరలిస్తే కఠిన చర్యలు తప్పవని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన లారీ,ఆటో,జీపు, సరుకుల వాహనాల యజమానులు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. గోవధ నిషేధ చట్టం కింద ఆవులను తరలించే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కఠినశిక్షలు విధిస్తామన్నారు.

ఈద్గా స్థలం పరిశీలన



ఈద్గా స్థలాన్ని పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాజేష్

డోన్: బక్రీద్ నేపథ్యంలో ఈద్గా మైదానాన్ని సోమవారం మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కౌన్సిలర్ రైల్వే నాగేంద్ర పరిశీలించారు. ప్రార్థనలు చేసేందుకు వీలుగా గుత్తిరోడ్డులోని ఈద్గా స్థలాన్ని మునిసిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. పనులను పరిశీలించిన చైర్మన్.. బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ముస్లింలకు సూచించారు.

అభివృద్ధి పథంలో ఆర్ఎస్ రంగాపురం

- కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు
- నాడు–నేడు పనులతో మారిపోయిన ఆరోగ్య కేంద్రం

ఆర్ఎస్ రంగాపురం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోంది. ఏళ్లుగా పాలకులు పట్టించుకోని సమస్యలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కరిస్తూ ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తోంది. వీధిరోడ్లు, మురుగు కాలువలు, శ్మశాన వాటిక, ఆరోగ్యకేంద్రం తదితర నిర్మాణాలకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సహకారంతో నిధులు మంజూరుకావడంతో గ్రామ రూపరేఖలే మారిపోయాయి. – బేతంచెర్ల

ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 8,225 మంది జనాభా, 6,469 మంది ఓటర్లు ఉన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టారు. డీఎంఎఫ్, జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.2 కోట్ల నిధులు మంజూరు కావడంతో అభివృద్ధి పనులు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంత పెద్ద ఎత్తున్న పనులు పూర్తి కావడంతో తమ కాలనీలు సౌకర్యంగా ఉన్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చేపట్టిన అభివృద్ధి పనులు..

డోన్ ప్రధాన రహదారి నుంచి ఎస్సీ కాలనీలోని సుంకులమ్మ ఆలయం వరకు రూ.25 లక్షలు, ఎస్సీ కాలనీ నుంచి శ్మశానవాటిక వరకు రూ. 5 లక్షలు, ఆసుపత్రి నుంచి కోళ్ల ఫారం వరకు వాటి చుట్టూ ఉన్న వీధుల్లో మొత్తం రూ.25 లక్షలు, 6వ వార్డులో రూ.10 లక్షలు, బస్టాండు నుంచి సుంకులమ్మ గుడి వరకు రూ.25 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామంలో రెండు సచివాలయాలు, రెండు రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ నిర్మాణాలు జరుగుతున్నాయి. నాడు–నేడు కింద రూ.23 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. జగనన్న లేఅవుట్ కాలనీల్లోనూ ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలో 90 వేల లీటర్ల కెపాసిటీతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు హిందూ శ్మశానవాటికలు ఆర్సీ, ప్రహరీలను రూ.11.80లక్షలతో నిర్మించారు.



గ్రామంలోని వీధులు కొత్త సీసీ రోడ్లతో ఆకర్షణీయంగా ..



గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అభివృద్ధి పనులు జరుగుతున్నాయి



నేను 1981, 1995లో రెండు సార్లు సర్పంచ్‌గా పనిచేశాను. ఇంతగా అభివృద్ధి పనులు చేపట్టలేదు. గ్రామంలోని ఆయా కాలనీలు అభివృద్ధికి నోచుకోక ఇబ్బందులు పడుతుండేవాళ్లం. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు పెద్దఎత్తున జరుగుతన్నాయి. గ్రామానికి మహర్దశ వచ్చింది.

– యమసాని జగన్ మోహన్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్

గ్రామం ఆకర్షణీయంగా ఉంది



గ్రామంలోని ప్రతి వీధికి సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయడంతో ఆకర్షణీయంగా ఉంది. సచివాయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధునీకరణ పనులు చేపట్టడంతో సౌకర్యంగా ఉంది.

– నాగ శేషు, ఎంపీటీసీ సభ్యుడు

మంత్రి చొరవతోనే..



ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతోనే గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయి. ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు సౌకర్యంగా ఉంది. ప్రజల విన్నపం మేరకు రానున్న రోజుల్లో మిగిలిపోయిన కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

– గ్రామ సర్పంచ్ గుమ్మ గాల్ల రాజు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బేతంచెర్ల: పట్టణం నుంచి డోన్ రహదారిలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏడీ మధుసూదన్‌రెడ్డి, టౌన్ ఏఈ మహబూబ్‌వలీ సోమవారం తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా లైన్ల మార్చనున్నామని ఈక్రమంలో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నుంచి హెచ్ కొట్టాల స్టేజీ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపిరు. పరిశ్రమల యజమానులు, వినియోగదారులు సహకరించాలన్నారు.

బిల్లులు మంజూరు చేయాలి

డోన్ టౌన్: ప్రస్తుతం ఇల్లు కట్టుకుంటున్న ప్రతి పేదవాడికి ఇంటి నిర్మాణం బిల్లులను త్వరగా మంజూరు చేయాని సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, నాగరాజు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆర్డీఓ వెంకటరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

డోన్: డోన్ ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు ఇద్దరు నిరుపేదలకు ఆపన్నహస్తం అందిస్తూ ఆర్థిక సహాయం అందించారు. లివర్ వ్యాధితో బాధపడుతున్న టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న విజయకాంతికి క్లబ్ సభ్యులు ముడియాల శైలజ, శకుంతల, ఝాన్సీలు రూ.5 వేలు, నిరుపేద బ్రాహ్మణ కుటుంబానికి చెందిన అయ్యర్ అనే విద్యార్థికి మరో దాత రూ.6 వేల నగదును సోమవారం అందజేశారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ సత్యదీప్, ఆయా శాఖల అధికారుల ఆధ్వర్యంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి మాట్లాడారు. వీఆర్వోలు, సర్వేయర్లు క్షేత్ర స్థాయిలో పొలాలను పరిశీలించి, ఆన్‌లైన్, పాసు పుస్తకాల మంజూరుకు సరైన డాక్యుమెంట్ అప్‌లోడ్ చేయాలన్నారు. తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కిరణ్ కుమార్, ఆర్ఐ శ్రీదేవి, మండల సర్వేయర్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఐ శివశంకర్ నాయక్

బేతంచెర్ల: పండుగలను శాంతియుత వాతావరణంలో స్నేహపూర్వకంగా జరుపుకోవాలనిఎస్ఐ శివశంకర్ నాయక్ సూచించారు. ఈనెల 29న బక్రీద్, తొలి ఏకాదశి పండుగ సందర్భంగా సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ముస్లిం, హిందూ మత పెద్దలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సమావేశంలో హిందూ సోదరులు గౌరి హుసేన్‌రెడ్డి, మారుతీ కృష్ణ, మండల ఖాజీ నూర్‌అహ్మద్, మూర్తుజావలీ, కందగడ్డల మోహన్‌రావు, రామూర్తి, మురళీ పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: తొలి ఏకాదశి, బక్రీద్ పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ రామిరెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సభ్యుల సమావేశంలో ఎస్ఐ రామిరెడ్డి మాట్లాడుతూ బనగానపల్లెలో హిందూ, ముస్లింలు ఐకమత్యంగా కొనసాగుతున్నారన్నారు. ఈనెల 29న రెండు పండుగలు ఒకే రోజు రావడంతో ఇదే సోదరభావాన్ని కొనసాగించి భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుని మతసామరస్యాన్ని చాటాలన్నారు. సమావేశంలో ఎస్ఐ వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఆహారంలో చిరుధాన్యాలు తప్పనిసరి



విజేతకు బహుమతి అందజేస్తున్న శాస్త్రవేత్త ధనలక్ష్మి

బనగానపల్లె రూరల్: ఆహారంలో వారంలో కనీసం రెండుమార్లు అయిన తప్పనిసరిగా చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి సూచించారు. సోమవారం కేవీకేలో చిరుధాన్యల వంటల తయారీ మండల స్థాయి పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ కొర్ర, జొన్న, సజ్జ తదితర చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల బీపీ, షుగర్‌తో పాటు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవచ్చన్నారు. వీటిని తీసుకోడం వల్ల రక్తహీనతను నివారించుకోవచ్చన్నారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త లక్ష్మీప్రియ చిరుధాన్యాల పంట సా గు,వాటి ఉపయోగాలను వివరించారు. వంటల త యారీలో 68 మంది మహిళలు,యువతులు పాల్గొ నగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు సా ధించిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, రవిగౌడ్, ఏఓ సురేష్‌కుమార్, బనగానపల్లె సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ప్యాపిలి: మండల పరిధిలోని కలచట్ల గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను సోమవారం సర్పంచ్ రమాదేవి భూమి పూజతో ప్రారంభించారు.

జలదుర్గం ఎస్ఐగా విజయ్‌కుమార్

ప్యాపిలి: జలదుర్గం ఎస్ఐగా విజయ్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన నరేశ్ నంద్యాలకు, హాలహర్విలో పనిచేస్తున్న విజయ్‌కుమార్‌ను ప్రభుత్వం బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

ప్యాపిలి: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ పాలన సాగిస్తున్నారని స్టేట్ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు అన్నారు. మండల పరిధిలోని బోంచెర్వుపల్లి, లక్ష్మితండా గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు మాట్లాడారు.

కూరగాయాలు

- చుక్కలనంటుతున్న ధరలు
- ఆందోళనలో పేద, మధ్యతరగతి ప్రజలు



కొనుగోళ్లు లేక వెలవెలబోతున్న దుకాణం

బనగానపల్లె: బనగానపల్లె కూరగాయల మార్కెట్‌లో 20 రోజులుగా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఊహించని విధంగా పెరిగిన ఈ ధరలతో మధ్య తరగతి, పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరల నియంత్రణపై సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. బీన్స్ ధర కిలో రూ.200, పచ్చి మిర్చి రూ.160, క్యారెట్, కాకర, టమాట రూ.100 చేరడంతో ఏమి కొనాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. బీర, కాలీఫ్లవర్, వంకాయ, ముల్లంగి, మునగ కిలో రూ.80కి చేరగా ఇతర కూరగాయల ధరలు రూ.60 నుంచి రూ.70 వరకు ఉన్నాయి. 20 రోజుల క్రితం వరకు వీటి ధరలు రూ.40 నుంచి రూ.50 వరకే ఉన్నట్లు వ్యాపారులే అంగీకరిస్తున్నారు. ఏటా వేసవిలో కూరగాయల ధరలు ఎక్కువగా ఉండేవి. ఈ సంవత్సరం వేసవి ముగుస్తున్న సమయంలోనూ ధరలు చుక్కలనంటుతుండడం సామాన్య, మధ్య తరగతి ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇదే ధర కొనసాగితే వీటిని కొనుగోలు చేయడం కష్టమన్న విషయాన్ని వ్యక్తం చేస్తున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేసున్న హోల్‌సేల్ వ్యాపారులు మార్కెట్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా సంబంధింత అధికారులు ధరల పెరుగుదలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

‘గడప గడప’లో ఆత్మీయ స్వాగతం





సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వంద రోజులు పూర్తి చేసుకోవడంతో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

- వంద రోజుల సందర్భంగా కోటపాడులో కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే

కొలిమిగుండ్ల: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటి నుంచీ ఆత్మీయ స్వాగతం లభిస్తోందని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి సోమవారం ఆయన కోటపాడులో పర్యటించారు. కార్యక్రమం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ బుక్‌లెట్‌ను అందించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రేషన్ కార్డులు, ఇళ్లు, పింఛన్ మంజూరు చేయాలని పలువురు కోరగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మూల సుంకమ్మ,ఎంపీటీసీ సభ్యురాలు కళావతి, హనుమంతుగుండం సొసైటీ అధ్యక్షుడు మూల ఈశ్వరరెడ్డి, వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, కోవెలకుంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు రామసుబ్బయ్య, నాయకులు మూల వెంకటేశ్వరరెడ్డి, పెద్ద నాగిరెడ్డి,రాంగోపాల్ యాదవ్, ఓబులేసు, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ రెడ్డి, ప్రభాకర్ నాయుడు, తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కమ్మవారిపల్లెలో..

కొలిమిగుండ్ల మండల పరిధిలోని కమ్మవారిపల్లె, లక్ష్మంపల్లె, పెద్దవెంతుర్ల గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారన్నారు. పెద్దవెంతుర్లలో రైతు భరోసా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభిస్తారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఉమామహేశ్వరుడికి పల్లకీ సేవ

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి పల్లకీ సేవ సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏక శిలారూపంలో కొలువైన శ్రీ శివపార్వతులకు ఉదయం ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకం, అర్చన నిర్వహించారు. సాయంత్రం ఉమామహేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవా నిర్వహించారు.

ఓపెన్ డిగ్రీకి దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతి, కళాశాల కేంద్రం కో ఆర్డినేటర్ లక్ష్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 31లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7382929778 నంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆర్బీకేల తనిఖీ

అవుకు: మండలంలోని చనుగొండ్ల, సుంకేసుల రైతుభరోసా కేంద్రాలను ఏఓ అబ్దుల్ హక్ సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

సంజామల: సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తోందని వైస్ ఎంపీపీ చిన్నబాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని పేరుసోముల సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిక్షణ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మాట్లాడారు.

రక్త నమూనాలతో ప్రయోజనం

డోన్ టౌన్: రక్త నమూనాల గుర్తింపుతో ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించుకోగలుగుతామని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మహ్మద్ హనీఫ్ అన్నారు. బ్లడ్ గ్రూపులను కనుగొన్న శాస్త్రవేత్త కార్ల్ ల్యాండ్‌స్టైనర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మహ్మద్‌రఫీ, డాక్టర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు





డోన్‌లో ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సంజామలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

- డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ టౌన్: మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను చేజేతులా నాశనం చేసుకోవద్దని డీఎస్పీ శ్రీనివాస రెడ్డి విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ మత్తుపదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహణ కార్యక్రమంతో పాటు పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో డీఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ సీఐ పెనుగొండ శేషయ్య, ప్రిన్సిపాల్ భారతి తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక పాతపేట హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని సూచించారు.

డోన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సూర్యశేఖర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవంలో హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ మధుకుమార్ పాల్గొని మాట్లాడారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

బనగానపల్లెరూరల్: స్థానిక కేజీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ దౌలత్‌ఖాన్ మాట్లాడుతూ యువత గుట్కా, జర్దా, మద్యం తదితర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రమ శిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మత్తుపదార్థాల వల్ల కలిగే నష్టాలను డాక్టర్ ఉమాదేవి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సదాశివమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంజామల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చెడు వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాగరాజు, లెక్చరర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభద్రతా భావం వద్దు



మాట్లాడుతున్న బ్రహ్మకుమారీ పద్మావతి

కొలిమిగుండ్ల: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే అభద్రతా భావాన్ని వీడి, అనుకున్న లక్ష్యాల వైపు అడుగులేయాలని బ్రహ్మకుమారీ పద్మావతి సూచించారు. సోమవారం చింతలాయిపల్లె ఉన్నత పాఠశాలలో సమత సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక రుగ్మతలు, భావోద్వేగాలు అదుపు చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. హెచ్‌ఎం మాధవి, సమత సొసైటీ అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యా కానుక పంపిణీ పూర్తి చేయండి

బనగానపల్లె రూరల్: జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీని త్వరగా పూర్తి చేయాలని మండల విద్యాధికారిణి స్వరూప సూచించారు. సోమవారం ఎమ్మార్సీలో ఎంపీపీ, యూపీ, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల చివరిలోపు విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందించి, బోధన చేయాలన్నారు. ముఖ సమావేశంలో ఎంఈఓ–2 శ్రీనివాసులు పాల్గొన్నారు.

పందులను అరికట్టాలి

డోన్ టౌన్: గ్రామంలో పందుల బెడద ఎక్కువగా ఉందని వాటిని నిలువరించాలని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ శీలం చంద్రశేఖర్.. సీఐ శేషయ్యకు వినతిపత్రం అందజేశారు.